





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 3-12-2024

సంపుటి: 20 సంచిక: 212
పేజీలు: 4 వెల: రూ.1


# పాత మరకలు.. కొత్త ఉతుకుడు





- ఎచ్చెర్ల ఇన్‌ఛార్జిగా పిన్నింటి పేరు పరిశీలన
- జగన్‌ను కలిసిన సాయి
- తిలక్, చింతాడ తరహాలోనే ఎచ్చెర్లలో మార్పు
- బొత్స, ధర్మాన మద్దతుతో రేసులో ముందు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఒక్కసారి అధికారంలోకి రావడం, ఆ సమయంలోనే ప్రజాప్రతినిధులు కావడంతో కన్నూమిన్నూ కానరాకుండా సామంతరాజుల కంటే ఎక్కువగా ఫీలైపోయి ఐదేళ్లూ పదవి అనుభవించిన వైకాపా నేతలకు ఇప్పుడు కౌంట్‌డౌన్ స్టార్టయింది. 2019-24 మధ్య ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు జనాల్ని పీడించడం, సొంత పార్టీ కార్యకర్తలను కూడా వేధించడం, స్థానికంగా అన్ని వ్యాపారాలూ వారే చేసి, భూదందాలు చేయడం వంటి వ్యవహారాలపై అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఉదాశీనంగా వ్యవహరించిన ఫలితంగా 2024లో ఆ పార్టీ ఘోర ఓటమిని రుచిచూసింది. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ పార్టీ అధికారంలో ఉండాల్సిన అవసరం ఏమిటో జగన్‌కు తెలిసొచ్చింది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల మీద పార్టీకి ఫిర్యాదులు వెళ్లినా కనీసం వారిని పిలిచి మందలించే పని కూడా చేయలేదు సరికదా, ఫిర్యాదు చేసినవారిపై కక్ష సాధింపులకు ఆ పార్టీ పూనుకొంది. అధికారంలో ఉన్నప్పుడు ఉపేక్షించినా, గతంలో వచ్చిన ఫిర్యాదుల ఫైళ్లను జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు దులుపుతున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళంలో అనేకచోట్ల ఇన్‌ఛార్జిల మార్పులకు శ్రీకారం చుట్టారు. టెక్కలి నియోజకవర్గం నుంచి తిలక్, ఆమదాలవలస నియోజకవర్గానికి చింతాడ రవికుమార్‌లను పార్టీ ప్రకటించింది. ఇప్పుడు తాజాగా ఎచ్చెర్ల నియోజకవర్గానికి కూడా సిటింగ్ ఇన్‌ఛార్జిని మార్చాలని పార్టీ భావిస్తోంది. ఇందులో భాగంగా రణస్థలం ఎంపీపీ ప్రతినిధి, జిల్లా వైకాపా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్‌ను కొద్ది రోజుల క్రితం వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి పిలిపించుకున్నారు. ఆ తర్వాతే ఆయన్ను ఎచ్చెర్లకు ఇన్‌ఛార్జిని చేస్తారన్న ప్రచారాలు ఊపందుకున్నాయి. గతంలో తిలక్‌కు, చింతాడ రవికుమార్‌లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చినప్పుడు 'సత్యం' కథనాలు ప్రచురించినందున ఇప్పుడు పిన్నింటి సాయి కథాకమామీషును అందిస్తున్నాం.

వాస్తవానికి 2024 ఎన్నికల్లోనే అప్పటి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను మార్చాలన్న ప్రతిపాదన వచ్చింది. జగన్మోహన్‌రెడ్డి తెప్పించుకున్న నివేదికల మేరకు కిరణ్ ఓడిపోతారని తేలింది. అదే సమయంలో విజయనగరం జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) ఇక్కడి నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ తెలుగుదేశం పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రయోగం చేయడంతో గొర్లె కిరణ్‌కుమార్ గెలిచేస్తారన్న ధీమాతో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ఆయనకే టిక్కెట్ ప్రకటించారు. ఫలితం అందరికీ తెలిసిందే. వాస్తవానికి 2024 ఎన్నికల సరికే పిన్నింటి సాయి వైకాపా టిక్కెట్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. స్వయాన గొర్లె కిరణ్‌కుమార్‌కు బావమరిది అయిన పిన్నింటి సాయే ఆయన అభ్యర్థిత్వాన్ని 2024లో వ్యతిరేకించారు. అందుకు కారణం.. గొర్లె కిరణ్‌కుమార్ కొందరివాడిగా మారిపోవడమే. ఈ నియోజకవర్గంలో నాలుగు మండలాలుంటే, ఈ నాలుగుచోట్లా బలమైన వైకాపా వర్గం గొర్లె కిరణ్‌ను వ్యతిరేకించింది. వైకాపా హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బహిరంగంగానే తిరుగుబాటు బావుటా ఎగరేసింది. జగన్ ముద్దు.. కిరణ్‌కుమార్ వద్దు అంటూ రోడ్డెక్కింది. అయితే అప్పట్లో అధిష్టానం దీన్ని సీరియస్‌గా తీసుకోవడం గాని, పిలిపించి మాట్లాడటం గాని చేయలేదు. నాలుగు మండలాల్లో గొర్లె కిరణ్‌కు వ్యతిరేకంగా మెజార్టీ వైకాపా నాయకులు జట్టు కట్టినప్పుడు కూడా పిన్నింటి సాయిని వారెవరూ వ్యతిరేకించలేదు. గొర్లె కిరణ్‌కుమార్‌కు బావమరిది అని ఎక్కడా ఆయన మీద వైకాపా వ్యతిరేక ముద్ర వేయలేదు. ఇప్పుడు అదే పిన్నింటికి కలిసొచ్చింది. 2014, 2019, 2024 వరుసగా మూడు ఎన్నికల్లో వైకాపా గొర్లె కిరణ్‌కుమార్‌కు అవకాశం కల్పిస్తే, ఇందులో 2019లో ఆయన గెలిచారు. ఈ మూడు ఎన్నికల్లోనూ బావ కోసం పిన్నింటి కష్టపడ్డారు. 2024 ఎన్నికల సమయంలో తన బావమరిది కూడా టిక్కెట్ ఆశిస్తున్నాడని తేలడంతో కిరణ్ ఆయన్ను పక్కన పెట్టినా ఆయన మాత్రం పార్టీ కోసమే పని చేశారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కిరణ్‌ను వ్యతిరేకించిన గ్రూపు సాయికి ఇన్‌ఛార్జిగా నియమిస్తామంటే అడ్డు చెప్పదన్న భావనతోనే పార్టీ ముందుకెళ్తున్నట్టు తెలుస్తుంది. ఇది కాకుండా అటు బొత్స, చిన్నశ్రీనుల కుటుంబాలు, ఇటు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్ కుటుంబాల ఆశీస్సులు పిన్నింటి సాయికే ఉన్నాయి. 20 ఏళ్ల యువకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి పిన్నింటి సాయి ధర్మాన అనుచరుడిగానే ముద్రపడ్డారు. ఎచ్చెర్ల - మిగతా 4లో



# కొత్త పాన్‌కార్డులు అందరికీ అవసరంలేదు!

**మార్పులు, చేర్పులు ఉంటేనే దరఖాస్తు చేసుకోవాలి । కార్డుల్లో క్యూఆర్ కోడ్ ఈసారి మరింత సేఫ్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాన్ కార్డ్.. ఇప్పుడు ప్రతి ఆర్థిక అవసరానికీ ఎంతో కీలకం. బ్యాంక్ ఖాతా తెరవడం నుంచి బంగారాన్ని కొనడం వరకూ పర్మినెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) తప్పనిసరి. ఈ పాన్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని ఇటీవల కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఇందుకోసం సుమారు రూ.1435 కోట్లు ఖర్చు చేయనుంది. పాన్, టాన్, టిన్‌లకు కలిపి ఏకీకృత వ్యవస్థను ఏర్పాటుచేసి, డేటా గోప్యత కోసం మరిన్ని చర్యలను తీసుకోనున్నట్లు ప్రకటించింది. డూప్లికేట్ పాన్, డబుల్ పాన్ వంటి వాటికి చెక్ చెప్పడంతో పాటు వివిధ వ్యవస్థలను బలోపేతం చేసి, పన్ను ఎగవేతలను మరింత కట్టడి చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఇంతకీ కేంద్రం కొత్తగా చెబుతున్న పాన్ 2.0 ఏంటి? ఇప్పటికే పాన్ ఉన్నవారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా? పాత పాన్ ఉన్నవాళ్లందరికీ కొత్తది పంపిస్తారా? మార్పులు చేర్పులు ఎలా చేసుకోవాలి?

### పాన్ కార్డ్ 2.0 అంటే?

పాన్ 2.0పై తలెత్తే కొన్ని ప్రశ్నలకు కేంద్రం ఇచ్చిన సమాధానాలు ముందుగా చూద్దాం. పన్ను చెల్లింపుదారుల రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటుచేసిన ఈ-గవర్నెన్స్ ప్రాజెక్ట్ ఇది. పాన్ సేవలను అధునాతన టెక్నాలజీతో మరింత సులభతరం చేయడం ప్రధాన ఉద్దేశం. ఈ ప్రాజెక్ట్ కింద పాన్ అలాంట్‌మెంట్, అప్‌డేషన్, కరెక్షన్ వంటి సేవలను ఏకీకృతం చేస్తారు. టాన్ (టాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అమౌంట్ నెంబర్)ను ఈ ప్రాజెక్ట్‌లో విలీనం చేయనున్నారు. పాన్‌ను వేగంగా (అథెంటికేషన్, వ్యాలిడేషన్) వెరిఫై చేసుకునే వెసులుబాటును ఫైనాన్షియల్ సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ ఏజెన్సీలు, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించబోతున్నారు. పాన్ 2.0తో వేగంగా డేటాను పొందొచ్చు. తప్పుల దిద్దుబాటు, మార్పులు త్వరగా పూర్తి చేసుకోవచ్చు. వేచి ఉండే సమయం తగ్గుతుంది. ఏకీకృత వ్యవస్థ కావడంతో డేటా అంతా ఒకేచోట ఉంటుంది. ఎలాంటి ఖర్చూ లేకుండా పాన్ పొందొచ్చు.

### పాత పాన్ కార్డుకు, కొత్తదానికి తేడా ఏంటి?

పాన్ సంబంధ సేవలను ప్రస్తుతం వివిధ విభాగాలు చూస్తున్నాయి. వాటిలో ఐటీ శాఖకు చెందిన ఈ-ఫైలింగ్ పోర్టల్, యూటీఐ ఐటీఎస్ఎల్ పోర్టల్, ప్రొటీన్ - ఈ గవర్నెన్స్ పోర్టల్ ఉన్నాయి. అయితే కొత్త వ్యవస్థలో పాన్, టాన్ సంబంధ సేవల బాధ్యతలను ఒకే సంస్థ చూసుకుంటుంది. సింగిల్ యూనిఫైడ్ పోర్టల్‌లో టాన్, పాన్‌కు సంబంధించిన పూర్తిస్థాయి సేవలు అందుబాటులో ఉంటాయి. కొత్తగా పాన్ జారీ, వాటిలో మార్పులు చేర్పులు, ఆన్‌లైన్‌లో పాన్ నిర్ధారణ, కార్డు పునర్ముద్రణ వంటివి ఈ పోర్టల్‌లోనే అందుబాటులో ఉంటాయి. టెక్నాలజీ ఆధారంగా పూర్తిగా పేపర్‌లెస్ విధానం ఉండనుంది. పాన్ కేటాయింపు, కరెక్షన్ వంటివన్నీ ఉచితంగానే చేసుకోవచ్చు. ఈ-పాన్‌ను రిజిస్టర్డ్ మెయిల్ ఐడీకి పంపుతారు.

ప్రస్తుతం మనం పాన్‌కార్డ్‌ను యూటీఐలో దరఖాస్తు చేసుకుంటే, మళ్లీ ఆ సంస్థ వెబ్‌సైట్‌కు వెళ్లి మాత్రమే కార్డ్ రీప్రింటింగ్, ఈ-పాన్, కరెక్షన్ వంటివి చేసుకుంటున్నాం. ఇప్పుడు ఆ ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పడుతుంది. అలానే ఆధార్-పాన్ మిస్‌మ్యాచ్ అయినప్పుడు అప్లికేషన్‌ను సదరు సంస్థకు ప్రాసెసింగ్ కోసం ఫిజికల్‌గా పంపాల్సి వచ్చేది. ఆ ఇబ్బంది కూడా ఇకపై ఉండకపోవచ్చు.

### కొత్త కార్డు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా?

పాత కార్డు చెలామణీలో ఉంటుంది. కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఏదైనా కరెక్షన్ - అప్‌డేషన్ ఉన్నప్పుడు మాత్రమే 2.0 కింద దరఖాస్తు చేసుకుని కొత్త కార్డును పొందొచ్చు. కొత్త వ్యవస్థలో కూడా పాత కార్డులు, నెంబర్లు పనిచేస్తాయని కేంద్రం స్పష్టంగా చెబుతోంది. ఇప్పటికే పాన్ ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త కార్డులను ఐటీ శాఖ పంపించదు.

### క్యూఆర్ కోడ్ తప్పనిసరా?

ఐదారేళ్లుగా పాన్ కార్డులు క్యూఆర్ కోడ్‌తోనే వస్తున్నాయి. కొత్త ప్రాజెక్టులో కూడా క్యూఆర్ ఆధారిత వ్యవస్థ ఉంటుంది. కొత్త దానిలో మరింత వేగంగా పాన్ డేటా ప్రాసెస్ అయ్యేలా డైనమిక్ క్యూఆర్ వ్యవస్థ ఉంటుంది. పాన్‌కార్డుపై ఉన్న క్యూఆర్ స్కాన్ చేయగానే పేరు, ఫొటో, సంతకం, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వంటి వివరాలన్నీ తేలికగా తెలుసుకోవచ్చు. ఇది బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సులువుగా ఉంటుంది. పాత పాన్ ఉన్నవాళ్లు మార్చుకోవడమే మంచిదని పాన్ ప్రాసెసింగ్ ఏజెన్సీ ప్రొటీన్‌టెక్ చెబుతోంది. పర్సనల్ డేటా, పెళ్లి తర్వాత ఇంటిపేరులో మార్పు, అడ్రస్ మార్పు వంటివి ఉన్నప్పుడు పాన్ డేటా అప్‌డేట్ చేసుకోవడం మంచిది. ఐటీ శాఖ యాక్ట్ 1961 ప్రకారం ఒకటి కంటే ఎక్కువ పాన్ కార్డులు ఉండడం నేరం. తెలియక ఎక్కువ కార్డులను కలిగి ఉంటే సంబంధిత ఐటీ అధికారిని సంప్రదించి ఒక కార్డును డీయాక్టివేట్ చేసుకోవాలి.

ఫోన్‌లోని క్యూఆర్ స్కానర్‌తో దీన్ని స్కాన్ చేయలేం. పాన్‌పైన ఉండే కోడ్‌లో డేటా అంతా ఎన్‌క్రిప్ట్ అయి ఉంటుంది. అథెంటిక్, సర్టిఫైడ్ స్కానర్స్ మాత్రమే వీటిని రీడ్ చేయగలవు. ప్రభుత్వ గుర్తింపు పొందిన వ్యవస్థలు, వ్యక్తులు మాత్రమే ఈ డేటాను యాక్సెస్ చేయగలరు. బ్యాంక్స్, ఐఆర్‌డీఏఐ గుర్తింపు పొందిన బ్రోకర్స్, మ్యూచువల్ ఫండ్ అడ్వైజర్స్, సెబీ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇన్సూరెన్స్ రిపాజిటరీలు, క్రెడిట్ కార్డ్ సంస్థలు, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు, కేవైసీ రిజిస్ట్రీ, ఐటీ శాఖ, స్టాక్ ఎక్స్ఛేంజీలు వంటి సంస్థలు మాత్రమే పాన్ క్యూఆర్ కోడ్ డేటాను డీకోడ్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. అందుకే డేటా గురించి భయపడాల్సిన అవసరం లేదు.



బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది..

# కిశోరి వికాసం!

**- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమష్టి కృషితో చేయూతనిద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం గుజరాతిపేటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటుచేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శాంతి, పీవో శోభారాణి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమిటీ రిపోర్టు వచ్చాక నియామకాలు చేపట్టాలి

**చంద్రబాబుకు లేఖ రాసిన రమణమాదిగ**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్సీలను వర్గీకరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఉంటుండగానే అది తేలేవరకు ఎస్సీల్లో ఉన్నవారందరికీ సమాన న్యాయం కోసం కూటమి ప్రభుత్వం వేసిన చిత్తరంజన్ మిశ్రా కమిటీ రిపోర్టు వచ్చిన తర్వాత రాష్ట్రంలో వైద్యుల పోస్టులు భర్తీచేయాలని రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి రమణ మాదిగ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. ఈమేరకు మంగళవారం దానిని పత్రికలకు విడుదల చేశారు. 281 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం మంగళవారం నోటిఫికేషన్ ఇచ్చారని, ఎస్సీ వర్గీకరణ పూర్తికాకుండా డాక్టర్ పోస్టులు భర్తీ అయినా చాలామందికి అన్యాయం జరుగుతుందని, అందువల్ల కనీసం రంజన్ మిశ్రా కమిటీ నివేదిక వచ్చేవరకైనా దాన్ని నిలుపుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ బదిలీలు జరిగాయని, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో మాత్రం జరగలేదు కాబట్టి ప్రస్తుతానికి ట్రాన్స్‌ఫర్స్ చేసి ఖాళీగా ఉన్న పోస్టుల్లో బదిలీల ద్వారా భర్తీచేసి కమిటీ రిపోర్టు వచ్చిన తర్వాత నియామకాలు జరిపితే బాగుంటుందని, దీనివల్ల ఎస్సీల్లో అనేక కేటగిరీల వారికి న్యాయం జరుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

• ఎడిటోరియల్

# బాయ్‌కాట్ పుష్ప ఎందుకు?

మునుపెన్నడూ లేని వ్యతిరేకత అల్లు అర్జున్ మీద కమ్ముకుంటోంది.. అది పుష్ప-2 సినిమాకు సంబంధించి. పనిలో పనిగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ వ్యతిరేకతలో కొంత తనూ మూటగట్టుకుంటోంది. సన్నీలియోన్ ప్రోగ్రాం రద్దు చేసిన పోలీసులు పుష్ప-2 ప్రిరిలీజ్ ఫంక్షన్ కోసం సాగిలబడ్డారు. ఇదేం న్యాయం..? అనేవారు ఉన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు, భారీగా పోలీసులు మోహరింపులు, బందోబస్తు.. ఏ జనహిత కార్యక్రమం కోసం ఈ పాట్లు? ఎందుకీ సాగిలబాట్లు? ఇంకా నయం.. పరేడ్ గ్రౌండ్స్‌లో జరుపుకోవడానికి పర్మిషన్ ఇవ్వలేదు.. ఒకరిద్దరు మంత్రులు కూడా వస్తామని చెప్పలేదు.. సంతోషం.. బన్నీ మొన్నటి ఎన్నికల్లో ఎవరో తన దోస్త్, వైకాపా అభ్యర్థి ప్రచారం కోసం వెళ్లాడు. అది మెగా క్యాంప్ కోపం. పైగా తను మెగా క్యాంప్ అయివుండీ జనసేన పవన్ కల్యాణ్ కోసం ప్రచారం చేయలేదు, పట్టించుకోలేదు. అసలు పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కూ బన్నీ ఫ్యాన్స్‌కూ నడుమ చాన్నాళ్లుగా ఏదో కనిపించని వైరం ఉండేది. ఇప్పుడది బహిరంగంగా పెద్దదయిపోయింది. చిరంజీవి బావమరిది కొడుకును అయినంత మాత్రాన నేను మెగా క్యాంపా..? నాది అల్లు క్యాంప్, సొంతంగానే ఎదుగుతాను, అసలే పాన్ ఇండియా స్టార్‌ను అనే ధోరణి బన్నీలో కనిపిస్తోంది. ఆ మెగా మర్రి నీడ నుంచి బయటపడే ప్రయత్నాలు.. ఇప్పుడు పుష్ప-2 సినిమా మీద మెగా ఫ్యాన్స్ ఫుల్లు వ్యతిరేకతను స్ప్రెడ్ చేస్తున్నారు. బాయ్‌కాట్ పుష్ప-2 క్యాంపెయిన్ గట్టిగా నడుస్తోంది. నెటిజనుల్లో చర్చ జోరుగా సాగుతోంది. అది ఎక్కడి దాకా వెళ్లిందంటే.. బన్నీ భార్య రెడ్డి (స్నేహలతారెడ్డి), బన్నీ రెడ్డింటి అల్లుడు, సో వైకాపా మనిషి.. మనకు పడదు.. మనం బన్నీ సినిమాలు చూడొద్దు.. ఇలాంటి వ్యాఖ్యల దాకా వెళ్లింది.. ఏపీ అంటే అంతే కదా. ప్రతిదీ కులానికే లింకు. ఆ సినిమా ఇన్నేళ్లుగా ఆగీ ఆగీ బోలెడు రీషూట్లు కూడా చేయించుకుని హీరోకు దర్శకుడికీ గ్యాప్, దర్శకుడికీ సంగీత దర్శకుడికీ గ్యాప్, కొత్త సంగీత దర్శకుల ఎంట్రీ, దాదాపు మూడున్నర గంటల సినిమా నిడివి.. అన్నీ అసాధారణమే. గతంలో ఏ సినిమాకూ లేనంతగా రేట్లను, షోలను పెంచింది తెలంగాణ ప్రభుత్వం. వారం పది రోజులు కాదు, అంతకుమించి, ఎంత రేట్లయినా పెట్టుకో, ఎంతయినా దోచుకో. అంత ఖర్చు ఎవడు పెట్టమన్నాడు..? ప్రేక్షకుల మీద ఇంతగా ఎందుకు రుద్దాలి అనే వ్యతిరేకత మరోవైపు ఎక్కువైంది. అవును, అంతే రేట్లు.. సరికాదు అనుకుంటే మీ ఇష్టం, ఎవడు చూడమన్నాడు అనే వ్యాఖ్యలూ కనిపిస్తున్నాయి. సినిమా సక్సెస్ అవుతుందేమో, వందల కోట్లు వస్తాయేమో. ఆ క్రేజ్ ఉంది బన్నీ మీద.. కానీ జరుగుతున్న పరిణామాలు, ప్రబలుతున్న వ్యతిరేకత ఇండస్ట్రీకి మంచిది కాదు.. తెలంగాణ ప్రభుత్వానికీ మంచిది కాదు.. అది అర్థమయ్యే స్థితిలో కూడా ప్రభుత్వం లేదు..!! పెద్ద సినిమా వస్తుందంటే టికెట్ రేట్లు పెంచడం కామన్ ప్రాక్టీస్ అయిపోయింది. ఇదేదో పుష్ప-2తోనే మొదలైంది కాదు, ఏళ్లుగా కొనసాగుతోంది. మరి పుష్ప-2పైనే ఎందుకింత వ్యతిరేకత? పెద్ద సినిమాల టికెట్ రేట్ల పెంపు వెనక ఉద్దేశం వేరు. బాహుబలి-2 లాంటి విజువల్ వండర్స్, కల్కి లాంటి పాన్ ఇండియా సినిమాలు రావాలంటే భారీ బడ్జెట్స్ అవసరం కాబట్టి.. టికెట్ రేట్లపై కొంత సడలింపు ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్దేశం. రానురాను ఈ ప్రత్యేక మినహాయింపును దుర్వినియోగం చేయడం, క్యాష్ చేసుకోవడం మొదలైంది. ఈ దుర్వినియోగాన్ని పుష్ప-2 మేకర్స్ పీక్ స్టేజ్‌కు తీసుకెళ్లారని ఆరోపిస్తున్నారు కొంతమంది ప్రేక్షకులు. ఇదే క్రమంలో ఇలాంటి జీవో ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వంపై కూడా విమర్శలు చేస్తున్నారు. రిలీజైన మొదటి వారం లేదా 10 రోజుల పెంపును ఇన్నాళ్లూ భరిస్తూ వచ్చారు. ఇంకా చెప్పాలంటే దానికి అలవాటు పడ్డారు కూడా. కానీ పుష్ప-2 విషయంలో గేట్లు బార్లా తెరిచేశారు. ఏకంగా 19 రోజుల పాటు టికెట్ రేట్లపై వివిధ స్థాయిల్లో పెంపు అనేది ఇప్పటివరకు ఏ సినిమాకూ జరగలేదు. పెద్దగా గ్రాఫిక్స్, భారీ సెట్స్ అవసరం లేని ఓ సినిమాను మూడేళ్లు తీసి, ఆ భారాన్ని ప్రేక్షకులపై మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అలా మొదలైందే "బాయ్‌కాట్ పుష్ప-2" ట్రెండ్. "ఎవడబ్బ సొమ్మని టికెట్ రేట్లను ఇష్టమొచ్చినట్టు పెంచుతున్నారు. రైతులకు కనీస మద్దతు ధర పెంచరు కానీ సినిమాలకు మాత్రం పెంచేస్తారు." అంటూ ఓ ప్రేక్షకుడు ఫైరయ్యాడు. మరో ప్రేక్షకుడు ఇలా రాసుకొచ్చాడు. "అంత బడ్జెట్ పెట్టి సినిమా ఎవడు తీయమన్నాడు? బాలీవుడ్‌కి పట్టిన గతే టాలీవుడ్‌కి కూడా పడుతుంది. ఇంత ధరలు పెట్టి చూసే బదులు సంవత్సరం మొత్తం ఓటీటీ ప్లానే వచ్చేస్తుంది కదా! ఒకరిద్దరి లాభాల కోసం లక్షల మంది ప్రజలను హింసించడం నేరం."



# అవసరం మేరకే సంపాదన..

# ఆ తరువాత అంతా ఉచితసేవ!

## భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన గీతా సారాంశమిదే!

భగవంతుని గురించి తెలుసుకునే వారందరూ చదవవలసిన ఒక అత్యద్భుతమైన యదార్థ సంఘటన. కొన్నేళ్ళ క్రితం మన దేశంలో ఉత్తర భారతంలో ఒక ఆయుర్వేద వైద్యుడు వుండేవాడు.

పేద డాక్టరు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు మనిషిని ఎలా జీవించమని చెప్పాడో కచ్చితంగా అలానే జీవిస్తూ వుండేవాడు. ఒక రోజుకు తన భార్య, కూతురు , తనకు ఎంత డబ్బు అవసరం అవుతుందో అంతే సంపాదించే వాడు.

(నన్ను నమ్మి , అహంకారం వదలి , నాకు శరణాగతి చేసుకొన్న వారి బాగోగులు నేనే చూసుకొంటాను.. "అనన్యాశ్చింతయోమా.. యోగక్షేమం వహామ్యహం".. 9వ అధ్యాయం, 22వ శ్లోకం.. ఉదాహరణకు రోజుకు 80రూపాయలు కావాలి.. ఎనిమిదిమంది పేషెంట్లు వచ్చారు, 80 రూపాయలు వచ్చింది. అంతే.. తొమ్మిదవ పేషెంటు దగ్గర డబ్బు తీసుకోడు. ఉచితం.

ఎప్పుడూ దైవ చింతనలో వుండేవాడు. ప్రతి ఉదయం ఆయన భార్య ఆయనకు ఒక కాగితం మీద ఇంటికి ఏమి కావాలో వ్రాసి ఇస్తుంది. దాన్ని తీసుకొని ఆస్పత్రికి వెళతాడు. ఆ వస్తువులకు ఎంత డబ్బు ఖర్చు అవుతుందో అంత డబ్బు (ఫీజు రూపంలో) రాగానే ఇక ఫీజు తీసుకోడు.

రేపు ఎలా ? అనే ఆలోచన లేదు. ఈరోజు ఇచ్చిన పరమాత్మ రేపు పిసినారి అవుతాడా ? వాసుదేవమితి సర్వం .

ఒక రోజు ఆసుపత్రి (చిన్న గది) ముందు ఒక కారు వచ్చి ఆగింది. అందులోంచి ఒక వ్యక్తి, డాక్టరు దగ్గరికొచ్చి ' నన్ను గుర్తుపట్టారా ?' అని అడిగాడు.

"క్షమించాలి, గుర్తుపట్టలేదు," అన్నాడు డాక్టరు. అపుడు ఆయన ఇలా చెప్పాడు : 15 ఏళ్ళ క్రితం ఒక రాత్రి ఈ వూరి గుండా వెళుతున్న నేను, ఇక్కడ కారు ఆగిపోతే కాసేపు ఆగాను. నా డ్రైవర్ కారు రిపేరు చేస్తున్నాడు. అపుడు మీరు వచ్చి 'లోపలికి రండి ' అన్నారు. గదిలోకొచ్చి కూర్చొన్న నన్ను చూసి 'మీరు ఏదో దిగులు పడుతున్నారు, ఆరోగ్యం సరిగాలేదా? 'అన్నారు. అపుడు మీ టేబిల్ దగ్గర సుమారుగా ఆరేళ్ళు వుండే ఒక చిన్న పాప మిమ్మల్ని 'నాన్నా, ఇక ఇంటికి వెళదాం, రండి ' అని పిలిచింది.

'కాసేపు ఆగమ్మా, కారు వెళ్ళాక మనం ఇంటికివెళదాం,' అన్నారు. ఆ చక్కటి పాపను చూస్తూ ఇలా అన్నాను. నేను ఇంగ్లాండులో వుంటాను. మాకు సంతానం లేదు. మా ఇంట్లో ఆడపాప వుండాలని మాకు ఎంతో కోరిక , కానీ తీరలేదు. ఇపుడు ఈ పాపను చూస్తే, నా బాధ గుర్తుకొచ్చింది" అన్నాను.

మీరు రెండు పొట్లాల ఔషధం తయారుచేసి 'మీరు, మీ భార్య దీన్ని 60 రోజుల పాటు ఒక్కో గుళిక చొప్పున తీసుకోండి' అన్నారు. నేను వీటికి డబ్బు ఎంత చెల్లించాలి ? అని అడుగుతుంటే అపుడు మరో పేషెంటు వచ్చి, తన జబ్బు చెప్పి, మీ దగ్గర మందు తీసుకొని వెళ్ళిపోతూ, నాదగ్గరకొచ్చి 'ఈరోజు కుటుంబం గడవడానికి ఎంత అవసరమో, ఆ డబ్బు అందాక వారు ఇక డబ్బు తీసుకోరు ' అని అంటూ వెళ్ళిపోయాడు.

కారు రిపేరు అయ్యింది. నేను మీకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయాను. దిల్లీ వెళ్ళి అక్కడినుండి ఇంగ్లాండు వెళ్ళాం. ఇంగ్లాండు డాక్టర్లు మాకు సంతానం ఇక కలగదు అని చెప్పిన తరువాత కూడా, మీరంటే నాకు కలిగిన అపారమైన గౌరవం, వృత్తిపట్ల మీ అంకిత భావం, మీ వ్యక్తిత్వం చూసాక నమ్మకం కలిగి నేను, రాధిక ఔషధం తీసుకొన్నాం. ఇపుడు మాకు ఇద్దరు ఆడపిల్లలు. పుత్తడి బొమ్మల్లావుంటారు. మీరు మాకు దేవుడితో సమానం.

అప్పటినుండీ మీ ఋణం ఎలా తీర్చుకోవాలా అని ఇద్దరం ఆలోచిస్తున్నాం. నాకు ఇక్కడ భారత్‌లో ఒక అక్క గారు వున్నారు . దురదృష్టం కొద్దీ ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మరణించారు. వాళ్ళకో కూతురు. ఆమె పెళ్ళి బాధ్యత నేనే తీసుకొన్నాను.


అపుడు నాకు 15 ఏళ్ళ క్రితం ఈ గదిలో నేను చూసిన మీ అమ్మాయి గుర్తుకొచ్చింది. ఆమె కూడా ఇపుడు పెళ్ళి వయసుకు వచ్చి వుంటుంది. ఆమె పెళ్ళికి అయ్యే ఖర్చు మొత్తం మేమే భరిస్తాం. మాకు ఆ అవకాశం ఇవ్వండి.

ఈనెల 24 న మా అక్క కూతురి పెళ్ళి. మీ అమ్మాయి పెళ్ళికి ఎంత ఖర్చు అవుతుందో నాకు తెలిసిన పద్ధతిలో లెక్కవేసి ఈ డబ్బు తెచ్చాను. మీరు డబ్బు కోసం ఎవరి దగ్గరా అప్పు చేయకండి. నేనున్నాను.ఇది మీరు తీసుకోవాలి" అంటూ ఒక కవరులో పెద్ద మొత్తం డబ్బును టేబిల్ మీద పెట్టాడు.

అపుడు డాక్టరు తన జేబులోంచి ఈ రోజు కుటుంబానికి ఏమి కావాలో తన భార్య ఆరోజు ఉదయం వ్రాసి ఇచ్చిన అవసరాల లిస్టును అతనికి చూపించాడు. అందులో చివరన ఇలా వ్రాసి వుంది : 'ఈనెల 22న మన అమ్మాయి పెళ్ళి. మన దగ్గర వంద రూపాయలు కూడా లేవు. ఆలోచించండి.' అనన్యాశ్చింతయోమా...యోగక్షేమం వహామ్యహం..

- గోపిరెడ్డి జగదీశ్వరరెడ్డి వాల్ నుంచి..

నయనతార నెట్‌ఫ్లిక్స్ చిత్రం చూస్తే ఏమనిపించింది? చాలామందికి ఏ మసాలాలూ లేని మామూలు సినిమా అనిపించింది. ఒకప్పుడు సినీతారల జీవితాల గురించి ఎంత ఆసక్తి ఉన్నా, వారు చెప్పేవే బయటకి వచ్చేవి. పబ్లిసిటీ అవసరం కాబట్టి అప్పుడప్పుడు అక్కరలేని స్టోరీలు కూడా వండి వార్చేవారు. అవికూడా సినిమా పత్రికలలోనే. వారి కుటుంబం, పిల్లలు చాలా అరుదుగా కనిపించేవారు. సోషల్ మీడియా ప్రవేశంతో సాధారణ జీవితాలు కూడా అసాధారణ సాహసాలతో, రోజువారీ పనులతో అందరికీ దగ్గరవడం మొదలైంది. దాంతో అనివార్యంగా సినిమా తారలు తమ విశేషాలు షేర్ చేసుకోవడం మొదలైంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా సినిమావార్తలు క్షణాల్లో చేరిపోతున్నాయి. అంతేనా! ఎవరెవరు ప్రేమలో ఉన్నారు? విడాకులు ఎవరు తీసుకుంటున్నారు కూడా అందరికీ తెలిసిపోతోంది.




అమాయకంగా, అనామకంగా సినిమా రంగంలో అడుగుపెట్టే అమ్మాయిలకు సమస్యలు ఇంకాస్త ఎక్కువే. వాటిని అధిగమించి అగ్రస్థానానికి చేరుకోవడం చాలా కష్టం. ఆ కష్టాన్ని దాటింది కాబట్టే నయనతార లేడీ సూపర్ స్టార్ స్టేటస్ సాధించింది. వ్యక్తిగత జీవితంలోను ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న నయన్ తలచుకుంటే ఆమె కథ ఇంకాస్త స్ఫూర్తిదాయకంగా చెయ్యచ్చు. కానీ ఈ నెట్ ఫ్లిక్స్ డాక్యుమెంటరీ పెద్దగా మెప్పించలేదనే చెప్పాలి.

# సాదాసీదా ఫెయిరీటేల్!

ఓటీటీ ప్లాట్ ఫార్మ్స్ వచ్చాక విషయ పరిజ్ఞానం మరింత పెరిగింది. సినిమావాళ్ళే రకరకాల కార్యక్రమాలు చేస్తున్నారు. ఒకప్పుడు రంగస్థల నటుల నుంచి అన్ని వర్గాల వారికీ తగిన మార్కెట్ ఉండేది. ఇప్పుడు తారలే అన్ని మార్కెట్లకు చొచ్చుకుపోయి అందరి పనులూ చేసేస్తున్నారు. మనకి ఇప్పటికే మహానటి సావిత్రి, జయలలిత,ఎన్టీఆర్ జీవిత చరిత్రలు సినిమాలుగా వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఒక సినీ హీరోయిన్ తన జీవితాన్ని ఒక చిత్రంగా చూపిస్తానంటే ఆసక్తిగానే ఉంటుంది. ఎవరివీ సమస్యలు లేని జీవితాలు కావు.



మనకి ఎందరో నటీనటులున్నారు. వారి వ్యక్తిగత జీవితాలూ ఆసక్తిదాయకంగానే ఉంటాయి. వాటిని సినిమాగానో, సిరీస్‌గానో రూపొందిద్దామని ఎవరూ అనుకోలేదు. నయనతారకు కలిసొచ్చిన అంశం ఇదే. అందుకేనేమో, ఆమె వివాహ ప్రసార హక్కుల కోసం కాకుండా తానుకొన్న జీవితం చూపడానికి నెట్‌ఫ్లిక్స్‌ని ఎంచుకుంది. ఈ చిత్రం బాగుంది అంతే . ఎలాంటి స్ఫూర్తి కలిగించదు. కొత్తగా సినిమాల్లోకి రావాలనుకునే అమ్మాయిలకు ఎలాంటి సూచనలూ లేవు. ప్రేమలో మోసపోకుండా ఎలా ఉండాలో చెప్పలేదు. తన బలహీనతను బలంగా ఎలా మార్చుకుందో చెప్పలేదు. ఆడపిల్లలు జీవిత భాగస్వామి విషయంలో ఏ ఫార్ములా నమ్ముకోవాలో చెప్ప లేదు. కనీసం పిల్లల సరోగసి గురించి కూడా చెప్పలేదు. ఈ అంశాలు కూడా వివరిస్తే ఇంకా ఎక్కడికో వెళ్లిపోయేది. సింపుల్‌గా తేల్చేసారు కాబట్టి నయనతార- విఘ్నేష్ శివన్‌ల ప్రేమకథలా మాత్రమే అనిపిస్తుంది. ధనుష్ తో వివాదం వల్ల ఫ్రీ పబ్లిసిటీ అయితే లభించింది. మొత్తమ్మీద నయనతార అభిమానులకు నచ్చే డాక్యుమెంటరీ మాత్రమే కానీ ఈ విజయం అనేకమంది నటులకు కొత్త బాట చూపుతుందేమో!

-కె.శోభ

# చీరలో అప్సరస మెరుపులు

'పుష్ప 2' కిస్సిక్ సాంగ్‌తో శ్రీలీల ఊహించని సర్ ప్రైజ్ ఇచ్చిన విషయం తెలిసిందే. సౌత్ ఇండియాలో క్రేజియస్ట్ హీరోయిన్ గా ఉన్న ఈ అమ్మడు ప్రస్తుతం డాన్సింగ్ క్వీన్ అనే ఇమేజ్ తో దూసుకుపోతోంది. కమర్షియల్ హీరోయిన్‌గా ఓ వైపు స్టార్ హీరోలతో జతకడుతూ మరో వైపు పాన్ ఇండియా స్టార్స్‌తో కూడా ఆడిపాడే అవకాశాలు అందుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇదిలా ఉంటే డిసెంబర్ 5న రిలీజ్ కాబోతున్న మోస్ట్ హ్యాపెనింగ్ మూవీ 'పుష్ప 2'లోని కిస్సిక్ సాంగ్‌తో ఈ బ్యూటీకి విపరీతమైన క్రేజ్ వచ్చేసింది. ఈ సాంగ్‌లో అల్లు అర్జున్‌తో కలిసి అదిరిపోయే డాన్స్‌మూమెంట్స్ చేసినట్లు తెలుస్తోంది. శ్రీలీల డాన్స్ పెర్ఫార్మెన్స్‌ని తెరపై చూడటానికి ఆమె ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ హిట్ అయితే కచ్చితంగా శ్రీలీల క్రేజ్ పెరిగిపోవడం గ్యారెంటీ అనుకుంటున్నారు. ఈ నెలలో శ్రీలీల హీరోయిన్‌గా నటించిన 'రాబిన్ హుడ్' మూవీ కూడా రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఇదిలా ఉంటే శ్రీలీల ఈ మధ్య ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా గ్లామర్ ఫోటోలని షేర్ చేస్తోంది. తాజాగా ఇన్ స్టాలో ఆమె వైట్ కలర్ చీరలో ఉన్న స్టైలిష్ గ్లామర్ పిక్స్ పోస్ట్ చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ తెల్లచీరలో శ్రీలీల దివి నుంచి దిగివచ్చిన అప్సరసల ఉందనే కామెంట్స్ వస్తున్నాయి. ఆమె అందానికి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే అని ప్రశంసిస్తున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...





# డిజిటల్ అరెస్టులు.. ఆన్‌లైన్ మోసాలు..

**ఎంత అవగాహన కల్పిస్తున్నా, ఎన్ని ప్రచారాలు చేస్తున్నా, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ స్కామ్స్ మాత్రం ఆగడం లేదు. బాధితులు పుట్టుకొస్తూనే ఉన్నారు. జస్ట్ ఈమధ్యే ఓ రిటైర్డ్ ఇంజనీర్ ఏకంగా 10 కోట్ల రూపాయలను ఆన్‌లైన్ మోసంలో పోగొట్టుకున్నాడు. దీనిపై ఇప్పటికే ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీస్ తో పాటు, కొన్ని మీడియా సంస్థలూ పరిశోధిస్తే ఇదంతా ఆగ్నేయాసియా నుంచి నడుస్తున్న డిజిటల్ క్రైమ్ సిండికేట్‌గా తేలింది. కాంబోడియా, మయన్మార్, లావోస్ ఈ మూడు దేశాలు ఈ డిజిటల్ మోసాలకు గోల్డెన్ ట్రయాంగిల్ గా మారాయి. సైబర్ క్రైమ్ తో పాటు, హ్యూమన్ ట్రాఫికింగ్ కు అడ్డాగా గోల్డెన్ ట్రయాంగిల్!**

**ఈడీ ఛార్జ్‌షీట్‌లో ప్రాధాన్యతాంశాలు!**

కంబోడియా, మయన్మార్, లావోస్ ఈ మూడు గోల్డెన్ ట్రయాంగిల్‌గా హాట్ స్పాట్స్ గా గుర్తించబడ్డాయి. ఈ ప్రాంతాలకు మానవ అక్రమ రవాణాకు థాయిలాండ్ ప్రధాన వారధిగా పనిచేస్తోంది. ఫేక్ జాబ్స్ పేరిట ఉచ్చుకు చిక్కిన బాధితులు అక్కడికెళ్లాక హింసకు గురికావల్సిందే. సైబర్ క్రైమ్స్‌లో బలవంతంగా పాల్గొనాల్సిందే. ఈ ప్రాంతాలకు 30 వేల మంది భారతీయులు ఇప్పటికే సందర్శకుల వీసాలపై వెళ్లి తిరిగిరాలేదని ఈడీ పేర్కొంది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన 36 ఏళ్ల మనీష్ తోమర్ కథను ఈడీ ఓ ఉదాహరణగా చూపింది. యూట్యూబర్ బాబీ కఠారియా నుంచి వచ్చిన నకిలీ ఉద్యోగం యాడ్‌తో మోసపోయి రెండు వేల రూపాయలతో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి మరీ లావోస్ వెళ్లి సైబర్ క్రైమ్ హబ్‌లో ఇరుక్కుపోయాడు.

నకిలీ ఫేస్ బుక్ ప్రొఫైల్స్ సృష్టించి యూఎస్ లోని భారతీయులను డాలర్లలో పెట్టుబడులు పెట్టమని ఆకర్షిస్తామని.. అందు కోసం, తామేది చెబితే అది చేయాల్సిందేనని తమను సైబర్ కేటుగాళ్లు బలవంతం చేస్తారని తోమర్ వంటివాళ్లు చెప్పే మాటలు.

# గోల్డెన్ ట్రయాంగిల్ కంట్రీస్!

సందడి సందడిగా ఉండే పర్యాటక ప్రాంతాలకు కాస్త దూరంగా బీచ్‌సైడ్ క్యాసినోలు, గేటెడ్ కాంప్లెక్సులే ఈ సైబర్ క్రైమ్ సిండికేట్ కు అడ్డాలు. ఇక్కడినుంచే క్రిమినల్స్ తమ సైబర్ స్కామ్స్ కు వ్యూహరచన చేస్తారు. బాధితులను వారిని బాధితులను చేసే బాధిత నిందితులకు కూడా తెలియకుండా ఈ రహస్య నేర సామ్రాజ్యాలు పనిచేస్తాయి.

ఈ సైబర్‌క్రైమ్‌లో ప్రధానంగా భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌లే ప్రధాన లక్ష్యాలు. ఇక్కడి నుంచి పురుషులతోపాటు.. మహిళలనూ అక్రమ రవాణా చేస్తున్నారు. మంచి జీతాల పేరుతో ఉద్యోగావకాశాలను ఎరగా వేస్తూ నేరాల్లో ఇరికించి బ్లాక్ మెయిలింగ్ తో బానిసలుగా మారుస్తున్నారు. శారీరక వేధింపులు, ఆకలికేకలు, నిరంతర బెదిరింపులు ఇక ఇవన్నీ.. అక్కడికి తెలియక చేరుకున్న పాపానికి అదనపు బోనస్.

**సైబర్ క్రైమ్స్‌పై కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ డేటా!**

అరచేతుల్లో మొబైల్‌ఫోన్‌తో ప్రపంచాన్ని చుట్టేస్తున్నామన్న సంతోషమెంతో.. అదేస్థాయిలో వినాశక చర్యలకూ మన టెక్నాలజీ ఉపయోగపడుతోంది. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్టు.. హ్యాకింగ్‌లో పండిపోయినవారెందరో ఇప్పుడు క్రిమినల్స్ చెంత చేరుతున్నారు. నేరుగా వారేం బయటకు వచ్చే అవకాశాలుండవు.. కావల్సినంత డబ్బు.. ఇలా హ్యాకింగ్‌లో నైపుణ్యం సంపాదించినవారంతా నేరాలబాట పడుతుండటంతో అమాయక జనం బాధితులుగా రోడ్డెక్కాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదే స్థాయిలో హ్యాకర్స్‌ను ఎదుర్కొనేలా ఎథికల్ హ్యాకింగ్ వ్యవస్థలు అన్ని రంగాల్లోనూ లేకపోవడమూ పెద్ద లోటుగా మారింది. ఇలాంటి లొసుగులను ఆసరా చేసుకుంటూ సైబర్ క్రైమ్స్‌కు వివిధ రూపాలిస్తూ అకౌంట్స్ లోంచి కోట్లు కొల్లగొడుతున్నారు కేటుగాళ్లు.

ఈ ఏడాది 2024 మొదటి నాలుగు నెలల్లోనే అంటే, జనవరి నుంచి ఏప్రిల్ వరకు సైబర్ క్రైమ్స్‌లో ఏకంగా భారతదేశం మొత్తమ్మీద ఏడు వేల కోట్ల రూపాయలను సైబర్ క్రైమ్ కేటుగాళ్లు స్వాహా చేశారన్నది ఏకంగా భారత హోంమంత్రిత్వ శాఖ ఇచ్చిన నివేదికలో పేర్కొన్న విషయం. ఏకంగా ఆరు లక్షల సైబర్ క్రైమ్ ఫిర్యాదులు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి అందాయి.

ఇక ఫలానాదాంట్లో పెట్టుబడి పెట్టండి మీకు పదింతల ఆదాయం వస్తుందంటూ ఫోన్ మెస్సేజెస్, వాట్సప్, ఇన్‌స్టా ద్వారా జరిగిన మోసాలకు సంబంధించిన 2023లో ఏకంగా పదివేల ఎఫ్ఐఆర్స్ నమోదయ్యాయి.

ఐటీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద 3 వేల యూనిఫార్మ్ రిసోర్స్ లొకేటర్స్ (యుఆర్ఎల్), 595 యాప్స్ బ్లాక్ చేశారు అధికారులు.

2023 జూలై నుంచి దేశవ్యాప్తంగా 5 లక్షల 30 వేల సిమ్ కార్డులతో పాటు, 80 వేల 848 ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ (ఐఎంఈఐ) నంబర్స్ బ్లాక్ చేయబడ్డాయి.



**హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ సైబర్ క్రైమ్స్‌పై ఈడీ దృష్టి!**

ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ సైబర్ క్రైమ్స్‌పై దృష్టి సారించింది. ఈడీ ఛార్జ్‌షీట్ ప్రకారం నకిలీ ఉద్యోగాల ఆఫర్స్‌తో ట్రాఫికర్స్ ఎలా ఆకర్షిస్తారో తన ఇన్వెస్టిగేషన్‌ను ప్రారంభించింది. ఆగ్నేయాసియాకు చేరుకున్న తర్వాత చాలామంది బాధితులు బయటకు రాలేక, అక్కడ ఉండలేక ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో.. అలాంటి పరిస్థితుల్లో వారు విధిలేని పక్షంలో ఎలా సైబర్ క్రైమ్స్ లో భాగస్వాములవుతున్నారో కూడా వెల్లడించింది.

**దౌత్యపరమైన జోక్యాలు, చర్యలు!**

గోల్డెన్ ట్రయాంగిల్ పేరుతో లావోస్, మయన్మార్, కాంబోడియాల్లో సాగుతున్న ఈ సైబర్ క్రైమ్స్ పై ఆ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలను భారత ప్రభుత్వం అలర్ట్ చేసింది. అవిప్పుడు అవిశ్రాంతంగా పనిచేస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బాబీ కఠారియా వంటి ట్రాఫికర్ ను ఎన్ఐఏ అరెస్ట్ చేసిన తర్వాత.. ఆ చైన్ మొత్తాన్ని ఛేదించే ప్రయత్నాలపై భారత నిఘా సంస్థలు మరింత దూకుడు పెంచాయి.

ఇదే సమయంలో ప్రజలు కూడా మొబైల్ ఫోన్స్ ద్వారా వచ్చే టెక్ట్స్ మెస్సేజెస్ నుంచి మొదలుకుంటే వాట్సప్ లో అనుమానితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ ఉచ్చులో పడొద్దని, వాటి ద్వారా వచ్చే మెస్సేజెస్ ని ఓపెన్ చేయొద్దని.. అతిగా ఆశపడి పెట్టుబడులతో వచ్చే సందేశాలను ఓపెన్ చేసి బ్యాంక్ అకౌంట్స్, ఇతరత్రా వివరాలు ఇవ్వొద్దని.. ఫేస్ బుక్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్స్ లో వచ్చే అన్ నోన్ మెస్సేజ్ పై అలర్ట్ గా ఉండాలని నిఘా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఎంత నిఘా సంస్థలు ఎందరు నేరస్థులను పట్టుకున్నా కూడా.. ప్రజల్లో అప్రమత్తత అనేది లేకుంటే ఈ నేరాలు పెచ్చుమీరడమే తప్ప.. తగ్గుముఖం పట్టవన్నది అధికారులు చెబుతున్న మాట.


- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## సమాచారం అందిస్తే ప్రోత్సాహకాలు




**(సత్యంన్యూస్, రణస్థలం)**

పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సమాచారం అందిస్తే, వివరాలు గోప్యంగా ఉంచి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని కోష్ట సచివాలయం మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జె.ఆర్.పురం స్టేషన్ పరిధిలో సీఐ అవతారం, ఎస్.ఐ. చిరంజీవి పర్యవేక్షణలో కోష్ట పంచాయతీ సక్సెస్ స్కూల్‌లో "సంకల్పం" కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో ఒక్కరు వ్యసనానికి బానిస అయినా ఇంటిల్లిపాదికీ ఎంతో నష్టం వాటిల్లుతుందని, దాన్ని పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతిఒక్కరూ మద్యం రహిత సమాజానికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. మద్యపానం అనర్థాలు తెలియజేస్తూ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కరిమజ్జి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సివిల్ సప్లై డీఎంగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరావు మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సమాజాభివృద్ధిలో పాత్రికేయులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డైరీని సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయులు పనిచేస్తున్నారని అన్నారు. పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం లాంటివన్నారు. అందుకే పత్రికలను ఫోర్త్‌ఎస్టేట్‌లో భాగంగా పేర్కొంటారని తెలిపారు. పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తాయన్నారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి సమర్థవంతమైన పరిపాలన అందించడానికి పత్రికలు తోడ్పడతాయన్నారు. తోడ్పడతాయి. అందుకే అమెరికాలాంటి ప్రజాస్వామ్య సమాజంలోనూ పత్రికలను ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా, ప్రజాకోర్టుగా పేర్కొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఆర్.ఎజ్రా, ఉపాధ్యక్షులు పిన్నింటి అప్పన్న, ప్రధాన కార్యదర్శి నారాయణమూర్తి, పరిటాల పద్మభూషణ్ సాయి, గొండు మణికుమార్, నందేష్, రాయి రాము, సిహెచ్ గణపతి, గొండు జనార్ధన రావు, రాజేష్, ఆకుల కృష్ణ, బొమ్మిడి వేణు, బాలకృష్ణ, నీలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీకాకుళం రంగస్థల సమాఖ్య 25వ వార్షికోత్సవం సందర్భంగా నగరానికి చెందిన డాక్టర్ ఆరికతోట కనకరాజు, ఉమ దంపతులు రూ.5వేలు విరాళం అందజేశారు. ఇతర ప్రదేశాల నుండి వచ్చే కళాకారులకు తగిన వసతి కల్పించేందుకు ఈ విరాళాన్ని వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకట్రావు, నీరా తదితరులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు చేస్తాం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



విశాఖపట్నం రేంజ్ పరిధిలో గంజాయి వ్యాపారుల ఆస్తులను జప్తు చేస్తామని విశాఖరేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం రేంజ్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలు, సిఐలతో డీఐజీ గోపినాథ్ జట్టి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గంజాయి వ్యాపారుల ఆస్తులను గుర్తించి, వాటిని జప్తు చేస్తామన్నారు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గంజాయి కట్టడికి తీసుకుంటున్న కఠిన చర్యల్లో భాగంగా గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతూ, పట్టుబడిన నిందితుల ఆస్తులను జప్తు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసు అధికారులు గంజాయి నిందితుల ఆస్తులను గుర్తించే పని చేపట్టాలని సూచించారు. ఇంత వరకు నమోదైన గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులు, వారు గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన ఆస్తులను గుర్తించాలన్నారు. నిందితుల పేరున గుర్తించిన ఆస్తులను జప్తు చేసేందుకు చేపట్టిట్టాల్సిన విధి, విధానాలు, నిబంధనలను అధికారులకు వివరించారు. ఆస్తుల జప్తుకు చట్టపరమైన ఎటువంటి చిక్కులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేంజ్ పరిధిలో ఇంతవరకు నమోదైన కేసుల్లో ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిని అధికారులను డీఐజీ అడిగి తెలుసుకొని, అధికారులకు దిశా నిర్దేశం చేసారు.

ఈ జూమ్ మీటింగులో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్, మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, ఎఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## పేరెంట్స్ సమావేశానికి తరలిరండి

**(సత్యంన్యూస్, టెక్కలి)**

ఈనెల 7 మండలంలోని పోరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశానికి తరలి రావాలని ప్రధానోపాధ్యాయులు జి.రాము పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఇంటింటికి వెళ్లి సమావేశ ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంత పాఠశాలలు కార్పొరేట్ దీటుగా ఉండాలంటే గ్రామస్తులందరూ ఐక్యంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కె.అచ్యుతరావు, ఎంపీటీసీ సభ్యులు జై తిరుమలరావు, జనపనం రూపవతి సంజీవరావులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre Women's College Road, Srikakulam - 532 001

## పాత మరకలు.. కొత్త ఉతుకుడు

(మొదటిపేజీ తరువాయి)

మండలంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీల మధ్య వివాదం హత్యా యత్నాల వరకు వెళ్లినప్పుడు పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కృష్ణదాస్ పిన్నింటి సాయిని కాన్ఫిడెన్షియల్ టీమ్‌లోకి తీసుకున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్ గెలవడం, అదే సమయంలో శ్రీకాకుళం నుంచి గెలిచిన ధర్మాన ప్రసాదరావుకు మంత్రి పదవి రాకపోవడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో కొన్ని సమావేశాలకు ధర్మానను పిలవాలన్న ప్రతిపాదన ఉన్నా కిరణ్‌కుమార్‌రెడ్డి అంగీకరించేవారు కాదన్న విషయం ధర్మాన క్యాంప్ ఆఫీసు వద్ద కూడా ఉంది. ఇక బొత్స కుటుంబంతో కిరణ్‌కుమార్ వైరం స్వయంకృతాపరాధం. ఎచ్చెర్ల నుంచి చిన్నశ్రీను పోటీ చేస్తారన్న భావనతో ఆయన పుట్టినరోజు సందర్భంగా గొర్లె కిరణ్ వ్యతిరేకవర్గం అప్పట్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే, దాన్ని కిరణ్ మనుషులతో చించివేయడం వంటివి చేశారు. ఫ్లెక్సీలు చింపుతూ కొందరు దొరకడం, వారిని పోలీసులకు అప్పగించడం, ఎచ్చెర్ల ఎంపీపీ మనుషులు చెబితేనే ఈ పనికి ఒప్పుకున్నామని వారు చెప్పడం అప్పట్లో పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. చిన్నశ్రీనును తమ నెత్తిన రుద్దుతున్నారన్న భావనతో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణను, అప్పటి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కూడా కిరణ్‌కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. చివరకు తన నియోజకవర్గంలో శుభకార్యం ఉందంటూ కార్డు ఇచ్చిన తూర్పుకాపులను బొత్స సత్తిబాబును పిలిస్తే తాను రానని సంకేతాలు కూడా ఇచ్చారని నేరుగా అప్పట్లో సత్తిబాబుకు ఫిర్యాదు చేశారు కూడా. శ్రీకాకుళం నుంచి ధర్మాన కుటుంబాన్ని, విజయనగరం నుంచి బొత్స కుటుంబాన్ని, స్థానికంగా వైకాపా నేతలను దూరం చేసుకున్న కిరణ్‌కుమార్‌కు మూడు అవకాశాలు ఇచ్చారు కాబట్టి ఈసారి కొత్తవారికి ఇవ్వాలన్న కోణంలో పార్టీ ఆలోచిస్తున్నట్టు తెలుస్తుంది. సరిగ్గా అదే సమయంలో పిన్నింటి సాయి విజయవాడలో జగన్మోహన్‌రెడ్డిని కలవడం ఈ ఊహలకు బలం చేకూర్చింది. వాస్తవానికి పిన్నింటి సాయికి నియోజకవర్గంలో అన్ని స్థాయిల్లో పరిచయాలు, మొహమాటాలు, రాకపోకలు ఉన్నాయి. ఈయనకు ఇన్‌ఛార్జిగా ప్రకటిస్తే గొర్లె కిరణ్‌కుమార్ మినహా మరెవరూ అభ్యంతరం చెప్పే అవకాశం కూడా ఉండదు.

గతంలో జరిగిన తప్పులను సరిదిద్దకపోవడం వల్లే 11 సీట్లకు పరిమితమైపోయామన్న భావన ఆ పార్టీలో ఉంది. ఇప్పుడు దాన్ని సరిదిద్ది నాలుగున్నరేళ్ల ముందే ఇన్‌ఛార్జిని ప్రకటించడం ద్వారా వ్యక్తిని, పార్టీని బలోపేతం చేయాలని జగన్మోహన్‌రెడ్డి భావిస్తున్నారు. ఇందులో భాగంగా పిన్నింటి సాయికి నియోజకవర్గ పగ్గాలు అప్పగిస్తారని ఆ పార్టీ చర్చ నడుస్తోంది. సాధారణంగా జగన్ ఒక నిర్ణయం తీసుకుంటే ఎవరితోనూ చర్చించరు. ఒకవేళ చర్చించాల్సిన అవసరమొస్తే అటు బొత్స గాని, ఇటు ధర్మాన కాని సాయిని కాదనే ప్రశ్న ఉండదు.

## ఖాదీ శంకర్రావుకు బెనారస్ వర్సిటీ ఆహ్వానం

(సత్యంన్యూస్, పొందూరు)



ఈ నెల 7న వారణాసిలోని హిందూ బెనారస్ యూనివర్సిటీ (హెచ్.బి.యు) భారత్ కళాభవన్‌లో జరిగే ఆర్టిస్టిక్ ఇంటర్నేషనల్ ఖాదీ పుస్తక ఆవిష్కరణ మహోత్సవానికి స్థానిక ఖాదీ సంస్థకు ఉద్యోగి జల్లేపల్లి శంకర్రావుకు ఆహ్వానం లభించింది. 'డ్రీమింగ్ ఇట్ ఫార్వర్డ్' అనే టైటిల్‌తో ఈ పుస్తకం ఆవిష్కరణకు సిద్ధంగా ఉంది. దీన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆవిష్కరించనున్నారు. ఎగ్జిబిషన్ కూడా జరుగుతుంది. తానా బానా (ట్రస్టు(వారణాశి) సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ పుస్తకంలో పొందూరు ఫైన్ ఖాదీకి సంబంధించిన పలు అంశాలు చోటుచేసుకోవడం విశేషం. ఈ సమున్నత కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా ఆహ్వానితుడైన శంకర్రావు హిందీ-తెలుగు అనువాదకునిగా ఎనలేని గుర్తింపు పొందారు. దీంతో ఆయన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ కేంద్రాల్లో గతంలో నిర్వహించిన ఖాదీ హస్త కళా ప్రదర్శనలకు కార్మికులతో కలిసి హాజరయ్యారు. హిందీ భాషలో ఆయనకు అసాధారణమైన ప్రతిభా పాటవాలు ఉండడమే కారణం. 2007లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ హైదరాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతిభవన్‌లో బస చేసినప్పుడు ఆమెకు పొందూరు ఖాదీ విశిష్టతను పూసగుచ్చినట్టు నివేదించారు. పర్యావసానంగా ఆమె ఓ ఖాదీ జరీ చీరను ఇక్కడ నుంచి తెప్పించుకున్నారు. మరో విశేషమేమిటంటే హిందీ-తెలుగు అనువాదకునిగా గుర్తింపు పొందిన శంకర్రావు స్థానిక ఖాదీ సంస్థ మొత్తం మూడుసార్లు విచ్చేసిన గాంధీ మనుమరాలు తారా భట్టాచార్జికి అనువాదకునిగా వ్యవహరించారు. ఆయన మహారాష్ట్ర వార్ధా జిల్లా సేవాగ్రామ్‌లో జన్మించారు. తండ్రి సత్యనారాయణ అప్పట్లో అక్కడ కేవీఐసీ ఉద్యోగిగా పనిచేశారు. శంకర్రావును ఈ సందర్భంగా ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జీకే ప్రసాద్, డీవీ రమణ, సిబ్బంది, కార్మికులు అభినందించారు.

# రేషన్.. పరేషాన్!

- ఈ నెల కందిపప్పు పంపిణీ లేదు
- ఒకసారి వాహనంలో.. మరోసారి పంచాయతీ డీలర్
- రేషన్ సరఫరా సరిగా లేదంటున్న లబ్ధిదారులు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

చిన్నరావుపల్లి గ్రామంలో మంగళవారం రేషన్ పంపిణీ చేశారు. అయితే ఆ పంపిణీలో కందిపప్పు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 108 కార్డులు ఉండగా కేవలం 60 మందికి పంపిణీ చేసి, మిగిలినవారికి పంపిణీ చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ప్రతినెల ఆ గ్రామంలో రేషన్ పంపిణీలో ఏదో ఒక అవకతవక జరుగుతూనే ఉంటుందని లబ్ధిదారులు అంటున్నారు. రేషన్ పంపిణీ గ్రామంలో ఒక నెల వాహనంలో పంపిణీ చేస్తే, మరో నెల పంచాయతీ డీలర్ వచ్చి పంపిణీ చేస్తున్నారని, ఎవరు ఎప్పుడు పంపిణీ చేస్తున్నారో తెలియడం లేదని అంటున్నారు. గత నెల కొంతమంది లబ్ధిదారులు ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి పంచాయతీలో రేషన్ సరుకులు తీసుకున్నారని తెలిపారు. అదే విధంగా పంచాయతీలో ఉన్న 108 రేషన్ కార్డులలో 40 కార్డులకు గత సంవత్సరం నుంచి ఎప్పుడు పంపిణీ చేస్తున్నారో తెలియడం లేదు. కారణం పంపిణీదారులకు అడిగితే హౌస్‌హోల్డ్ మ్యాప్‌లో ఎటో వెళ్లిపోయాయన్నట్లు సమాధానం చెబుతున్నారు. అసలు గ్రామంలో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదని, దీనిపైన అధికారులు, నాయకులు స్పందించి చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# దేవాలయం పేరుతో దౌర్జన్యం

(సత్యంన్యూస్, హిరమండలం)

హిరమండలం శుభలయ కాలనీలో నివాసముంటున్న వితంతు గిరిజన మహిళ కిట్టాలపాడు కరువమ్మకు తన భర్త పేరు మీద ఇచ్చిన పట్టా భూమిలో ఇప్పుడు దేవాలయం నిర్మిస్తామని కొందరు తాము వేసుకున్న రేకుషెడ్‌ను కూల్చేసి స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు మంగళవారం ధర్నా చేశారు. తమ ఆధీనంలో ఉన్న భూమికి పట్టా ఉన్నా, తాము ఇంట్లో లేని సమయంలో దాన్ని తొలగించి తమను కులంపేరుతో దుర్భాషలాడినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయం కోసం గతంలో కేటాయించిన భూమిని విక్రయించేసి, ఇప్పుడు తన భూమి మీదకు వచ్చారని బాధితురాలు తెలిపారు.



## సముచిత స్థానం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ ప్రజల హక్కులను కాపాడి, చట్టసభల్లో సముచిత స్థానం కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా కేంద్ర ప్రభుత్వం కేంద్రంలో బీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవటమే దీనికి నిదర్శనమన్నారు. ఈమేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమంది బీసీ నాయకులు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించి కూడా నేటి వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావకపోవటం పట్ల ఆమె విచారం వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాధికారం అనే నినాదాలు ఎన్నికల తర్వాత మందగిస్తున్నాయని విమర్శించారు. దేశంలో ఎన్ని రాష్ట్రాల్లో బీసీ నాయకులు ముఖ్యమంత్రులుగా పదవులు నిర్వహిస్తున్నారని డాక్టర్ గుణవతి ప్రశ్నించారు. దేశంలో బీసీ సంఘాలు ఏకతాటిపై నడిచినట్లయితే బీసీలకు రాజ్యాధికారం సాధ్యపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాల వారీగా సంఘం అధ్యక్షులను నియమించినప్పుడు వారు గతంలో సంఘానికి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకోవాలని డాక్టర్ గుణవతి సూచించారు.


# గ్రంథాలయంలో రాజేంద్రప్రసాద్ జయంతి

(సత్యంన్యూస్, లావేరు)



భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా అత్యున్నత పదవిని చేపట్టి పదేళ్లపాటు భారత తొలి పౌరుడిగా మహోన్నత సేవలందించిన బాబూ రాజేంద్ర ప్రసాద్ 1884 డిసెంబర్ మూడవ తేదీన జన్మించారన్నారు. జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరపున అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధైర్యం వద్దు.. అండగా ఉంటాం!




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భరోసా
- సౌదీలో చిక్కుకున్న శ్రీకాకుళం వలస కార్మికులతో ఫోన్లో మాట్లాడిన మంత్రి

పొట్ట కూటి కోసం విదేశాలకు వెళ్లి, యాజమాన్యాల చిక్కుకున్న వలస కార్మికులకు అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు భరోసా కల్పించారు. బాధితులందరినీ స్వదేశానికి తీసుకువచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖపై ఒత్తిడి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాం, ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన దాదాపు 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి, చిక్కుకున్న విషయం తెలిసిందే. 2 నెలలు పని చేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం, గత 4 రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోయారు. బాధిత కుటుంబాల ద్వారా సమస్యను తెలుసుకున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన బాధిత కార్మికులతో సోమవారం మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలిసి ఒప్పిస్తానని ప్రకటించారు. అలాగే భారత ఎంబసీ కార్యాలయానికి సమస్యను చేరవేసి, ఆహారం, ఇతర ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. దీంతో ఎంతో ఉపశమనం లభించిందని బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

# అసంబద్ధంగా వందరోజుల కార్యాచరణ ప్రణాళిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పదో తరగతి పరీక్షలకు సన్నద్ధత కోసం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అసంబద్ధంగా ఉందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు ఓ ప్రకటనలో ఖండించారు. ఒకదాని వెంట మరొకటి విద్యాశాఖ విడుదల చేస్తున్న ఉపాధ్యాయ వేధింపుల ఉత్తర్వులకు ఈ కార్యాచరణ ప్రణాళిక ఒక ఉదాహరణగా ఉందని పేర్కొన్నారు. రెండో శనివారం, ఆదివారాల్లో కూడా పని చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూడు నెలల పాటు ఒక్కరోజు కూడా సెలవు లేకుండా ఎంత పదో తరగతి అయినా అటు విద్యార్థులు గాని, ఇటు ఉపాధ్యాయులు గాని పాఠశాలలకు ఎలా హాజరు కాగలరని భావిస్తున్నారో అర్థం కాకుండా ఉందని తెలిపారు. సంక్రాంతి సెలవు దినాల్లో కూడా కేవలం మూడు రోజులు మాత్రమే సెలవులను తీసుకొని పండుగ చేసుకోమని విద్యాశాఖ చెప్పడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లి పండగ చేసుకునే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇది మింగుడుపడని పరిణామమని పేర్కొన్నారు. సదరు ఉత్తర్వులను తక్షణమే నిలుపుదల చేసి విద్యార్థులకు ఉపాధ్యాయులకు శని, ఆదివారాలు పండగ సెలవులు వెసులుబాటు కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుని వేధించే ఇలాంటి చర్యలను సహించబోమని తెలిపారు. ప్రకటన విడుదల చేసినవారిలో పట్నాన వెంకటరమణ, పూడి లక్ష్మీపతి, కుప్పన్నగారి శ్రీనివాసరావు, గొండబ మేరీప్రసాద్, చింతపల్లి జనార్ధన, గంటి మీనాకుమారి, అరసవల్లి గణపతిరావు, రఘుపాత్రుని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## సెలవుల్లో టెన్త్ స్టడీ అవర్స్ మినహాయించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పదవ తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో స్టడీ అవర్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్యా శాఖ విడుదల చేసిన పదో తరగతికి వంద రోజుల కార్యాచరణలో ప్రతి ఆదివారం క్లాసులు నిర్వహించాలని, సంక్రాంతి సెలవుల్లో పండగ మూడు రోజులు తప్ప మిగిలిన అన్ని రోజులు క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ రకమైన ఆదేశాలు శాస్త్రీయంగా లేవని, ఇది విద్యార్థులను, ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడమౌతుందన్నారు. విరామం లేని చదువు, బోధన నిరుపయోగమని, దీనిపై ఆలోచించాలని కోరారు.

# 5న కొరికాన బాధ్యతల స్వీకరణ

- ప్రమాణస్వీకారానికి భారీగా అభిమానులు తరలిరావాలి
- జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న కొరికాన రవికుమార్‌ను ఆశీర్వదించేందుకు తరలిరావాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న సుడా చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి జనసేన పార్టీ, తెలుగుదేశం, భారతీయ జనతాపార్టీ కుటుంబ సభ్యులంతా హాజరు కావాలని కోరారు. ఆరు నెలల పాలనలో ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి పెద్దపీట వేసిందన్నారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి నూతన వరవడితో ముందుకు పోతున్నామని అన్నారు. సుడా చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రాష్ట్రమంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, సుడా అధికారులు, జనసేనపార్టీ అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, జనసేన రాష్ట్ర నాయకులు, జనసేన జిల్లా ముఖ్య నాయకులు, జనసేన మండలపార్టీ అధ్యక్షులు, జిల్లా టీడీపీ, బీజేపీ ముఖ్య నాయకులు హాజరవుతారని, కూటమి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలని కోరారు. విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, శ్రీకాకుళం పట్టణ నాయకుడు పాండ్రంకి రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

# క్షతగాత్రుని వైద్యానికి రూ.10వేలు సాయం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కిల్లిపాలెం గ్రామానికి చెందిన అలబాణ చిన్నారావు వృత్తిరీత్యా డెలివరీ బాయ్ కాగా, ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు తెగిపోయింది. తండ్రి కొంత కాలం క్రితం చనిపోగా, తల్లి వృద్ధాప్యంలో ఉంది. ఈ నేపథ్యంలో చిన్నారావు కుటుంబాన్ని మనసున్న దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు కోరారు. చిన్నరావు వైద్యానికి ఆరోగ్యశ్రీ కూడా చికిత్సకు వర్తించదని, చికిత్స కోసం లక్షల రూపాయలు అవసరమని అపోలో వైద్యులు చెప్పడంతో, ఆర్థిక ఇబ్బందుల వలన కేజీహెచ్‌కు తరలించారు. నిరుపేద కుటుంబం కావటంతో గ్రామస్థులు, సహాయం కోసం సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితిని కోరారు. స్పందించిన సంస్థ సభ్యులు తమ మిత్ర బృందంతో పాటు, దాతల ద్వారా సమకూర్చిన రూ.10వేలు మంగళవారం కిల్లిపాలెంలో చిన్నారావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారావు తల్లి, కుటుంబ సభ్యులు, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పొడుగు అవినాష్, జగదీష్, బరాటం చంద్రశేఖర్, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, ఇతర సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 100 రోజుల యాక్షన్ ప్లాన్ సవరించాలి

సత్యంన్యూస్, శ్రీకాకుళం

విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి పరీక్షల కోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్ అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్‌వి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది విద్యార్థుల విద్యాభివృద్ధికి ఏమాత్రం దోహదకారిగా లేదని, విద్యా ప్రమాణాలు మరింత నష్టం చేకూర్చే విధంగా ఉందని వారు చెప్పారు. ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా విద్యార్థుల మానసిక స్థితిని మరింత ఒత్తిడికి గురిచేయడం సరికాదని, చదువుతోపాటు రిక్రియేషన్ ఆట విశ్రాంతి కూడా అవసరం ఉంటుందని వారు చెప్పారు. ఈవిధమైన ఒత్తిడితో కూడిన చదువులు ఎంతటి నష్టదాయకమో కార్పొరేట్ వ్యవస్థలో చూసామని, వాటి నుంచి గుణపాఠాలు తీసుకోకుండా, వాటిని నివారించకుండా ఆ విధానాల్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలు చేయాలని చూడడం సరికాదని వారన్నారు. ఇప్పటికే టెన్త్ పరీక్షల ప్రిపరేషన్‌కు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వారి వారి పాఠశాల అనుకూలతను విద్యార్థుల సంసిద్ధతను దృష్టిలో పెట్టుకొని ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట రెమిడీయల్ క్లాసులు, స్టడీ అవర్ట్ నిర్వహిస్తున్నారనీ, ఇది ఏ అధికారి చెప్పకుండానే గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు తామంతట తాము స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారని, దీనిని ఈ విధంగా కొనసాగనివ్వకుండా అధికారులు ఒత్తిడికి గురిచేసే విధంగా ఈ కార్యక్రమం ప్రకటించడం సరికాదన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధత చేసి అధిక శాతం ఫలితాలు రాబట్టడంలో ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయునికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని వారు కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.